ఈనాడు పశ్చిమగోదావరి

ఆదివారం అక్టోబరు 6, 2024 13

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తం కుమార్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చింతలపూడి మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలు రూపొందించిందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వడమే కాకుండా న్యాయవాదినీ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం చింతలపూడి సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న మౌలిక వసతులను సూపరింటెండెంట్ కృపానందను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెం, భీమవరం కేంద్రాల్లో నిత్యం రెండు విడతల్లో పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తం 180 మందికిగాను 28 మంది గైర్హాజరైనట్లు డీఈవో జి.నాగమణి తెలిపారు.





ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

శ్రీనివాసా.. గోవిందా..!

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చారు. గోవింద నామస్మరణతో శేషాచలం మారుమోగింది. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి సుమారు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేక క్యూ ద్వారా దర్శనానికి అనుమతించారు.

నిత్యానందకరీ.. వరాభయకరి..



పాలకొల్లు: క్షీరారామంలో అన్నపూర్ణాదేవిగా

పాలకొల్లు ఆధ్యాత్మికం, పెనుగొండ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏలూరు, వట్లూరు, రాట్నాలకుంట, ద్వారకాతిరుమల, పాలకొల్లు, భీమవరం, పెనుగొండ క్షేత్రాలు మూడో రోజు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పెనుగొండ వాసవీ క్షేత్రంలో అమ్మవారు లలితాదేవిగా, భీమవరంలో మావుళ్లమ్మ గాయత్రిదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు.



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మ



పెనుగొండ: లలితాదేవిగా వాసవీమాత

వారు రారు.. వీళ్లను వదలరు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక సంఘం కార్యాలయంలో పనిచేస్తూ బదిలీ అయిన ఉద్యోగులను అధికారులు రిలీవ్ చేయడం లేదు. దీంతో పలువురు సెలవుపై వెళ్తున్నారు. పట్టణ ప్రణాళికా విభాగ అధికారి, జీ2 ఇద్దరు గుమస్తాలు, ఇంజినీరింగ్ విభాగంలో డీఈ, ఇద్దరు ఏఈలు, ఇద్దరు గుమస్తాలు, అకౌంట్సు విభాగంలో జేఏవో, మరో అధికారి, మేనేజరు సెక్షన్లో సీ1, సీ4 సిబ్బందికి బదిలీ అయ్యింది. వారి స్థానంలో నియమితులైన సిబ్బంది చేరేందుకు రాలేదు. ఇప్పటికే ఒక ఏఈ సెలవుపై వెళ్లారు. బదిలీ అయిన మిగిలిన ఉద్యోగులు కూడా ఇదే మార్గంలో వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. దీనిపై పురపాలక సంఘ కమిషనర్ ఎం.అంజయ్యను వివరణ కోరగా ఇక్కడ నియమితులైన వారు చేరిన వెంటనే బదిలీ అయిన వారిని రిలీవ్ చేయనున్నామన్నారు.

అటవీ భూములు మాయం



ఇది నూజివీడు మండలం సిద్ధార్థ నగర్ సమీపంలోని అటవీ భూముల్లో ఏర్పాటు చేసిన 40 అడుగుల రహదారి. ఇక్కడ 450 ఎకరాల మేర అటవీ భూములుండగా ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ద్వారా 60 ఎకరాలకు పట్టాలిచ్చారు. కేవలం సాగు చేసుకునేందుకు వీరికిచ్చిన భూములను బేరం పెట్టారు. ఎకరం రూ.10 లక్షలకు అమ్మేందుకు అడ్వాన్సులు కూడా తీసుకున్నారు. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు కొనుగోలుదారు ఇలా అడవిలో రహదారి వేసేశారు.



ఇది చింతలపూడి మండలం కంచన్నగూడెంలో అటవీ భూముల ఆక్రమణలకు సాక్ష్యం. ఎన్నో ఏళ్ల కిందట ఈ ప్రాంతంలో అటవీ భూములకు, పట్టా భూమికి సరిహద్దు నిర్ణయించారు. కొందరు అటవీశాఖ అధికారులు గ్రామస్థుల నుంచి ముడుపులు తీసుకుని ఆ సరిహద్దును వెనక్కి మార్చారు. అక్కడ సాగు చేసుకుంటున్నందుకు నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. దీంతో గ్రామస్థులు అటవీ భూమి తమదే అంటూ ఇలా కంచె వేశారు.

☛ లింగపాలెం మండలం కలరాయనగూడెంలో ఇటీవల కొందరు అటవీ భూమిని ఆక్రమించి సాగు చేసేందుకు దున్నుతున్నారు. విషయం తెలిసిన సిబ్బంది ఆక్రమణలు నిలిపేయాలని చెప్పారు. దీంతో ఆవేశంతో ఊగిపోయిన వారు మరికొందరిని సమీకరించారు. సిబ్బందిపై కర్రలతో ఇష్టారాజ్యంగా దాడి చేశారు. నలుగురు సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఓ వైకాపా నేత దీనికి సూత్రధారి.

☛ రికార్డులను తారుమారు చేస్తూ ఆక్రమణలు ☛ ముడుపుల మత్తులో అధికారులు

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే - నూజివీడు పట్టణం, చింతలపూడి పట్టణం: అటవీ భూములు ఆక్రమణల చెరలో మగ్గిపోతున్నాయి. ఓ వైపు కలప తరలిస్తూనే మరో వైపు అడ్డగోలు ఆక్రమణలకు తెగబడుతున్నారు. రికార్డులు మార్చేస్తున్నారు. అడవి మధ్యలో రహదారులు ఏర్పాటు చేసేసి..నిబంధనలు తుంగలో తొక్కి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మిన్నకుంటున్నారు. అడపాదడపా సిబ్బంది ఆక్రమణలను అడ్డుకుంటున్నా వారిపై కూడా దాడులకు తెగబడుతున్నారు.

అడవులు అమ్మేస్తారా.. ఏలూరు జిల్లాలో ఏడు రేంజిల పరిధిలో 3.5 లక్షల ఎకరాల్లో అడవులున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 19,344 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నట్లు చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రెట్టింపు భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం కింద పోడు వ్యవసాయం చేసుకునేందుకు 51,270 ఎకరాల భూమికి బీఫాం పట్టాలిచ్చారు. నిబంధనల ప్రకారం ఈ భూమిని సాగు చేసుకోవడానికి మాత్రమే వారికి హక్కు ఉంటుంది. క్రయవిక్రయాలు, రహదారుల ఏర్పాటు నిషిద్ధం. ఆ భూముల్లో చాలా వరకు అమ్మకాలు జరిగిపోయాయి. ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

అధికారిక లెక్కల ప్రకారం రేంజిల వారీగా అడవుల విస్తీర్ణం, ఆక్రమణలు (ఎకరాల్లో)

రేంజి	మొత్తం	ఆక్రమణలు
ఏలూరు	43,660	1,896
నూజివీడు	32,880	8,922
జంగారెడ్డిగూడెం	49,017	1,286
కుక్కునూరు	76,338	3,734
అమరవరం	41,999	3,506
మొత్తం	3,50,286	19,344

వందల మంది సిబ్బంది ఉన్నా.. జిల్లాలోని ఏడు రేంజిల పరిధిలో 25 సెక్షన్లు, 68 బీట్లున్నాయి. వందల మంది సిబ్బంది ఉన్నారు. అయినా ఆక్రమణలు, అమ్మకాలు, రికార్డుల మార్పు జరిగిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో ఆక్రమణదారుల నుంచి సిబ్బంది భారీగా ముడుపులు వసూలు చేసి మిన్నకుండి పోతున్నారు. కొందరు మరో అడుగు ముందుకు వేసి రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డులు కూడా తారుమారు చేస్తున్నారు. అటవీ భూములకు రెవెన్యూ భూములుగా పట్టాలు సృష్టిస్తున్నారు. చింతలపూడి, టి.నరసాపురం, నూజివీడు, కుక్కునూరు మండలాల్లో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. రెవెన్యూ అధికారులు ఎకరానికి రూ.50 వేలు తీసుకుని రికార్డులు మారుస్తున్నారు. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ..అడవుల్లో ఆక్రమణల తొలగింపుపై అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు.



నూజివీడు: సిద్ధార్థ నగర్ సమీపంలో మామిడి సాగు

టమోట..! బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100



పెంటపాడు, న్యూస్‌టుడే: ఏ ఇంట్లోనైనా కూరలోకి టమాట లేనిదే కుదరదు. బయట రాష్ట్రాల్లో, మదనపల్లె పరిసర ప్రాంతాల్లో దిగుబడి తగ్గడంతో రెండు రోజుల్లోనే ధర రెట్టింపైంది. నెల రోజులుగా మేలు రకం కిలో రూ.60 ఉండగా నాసిరకం రూ.50 వరకు ఉండేది. ప్రస్తుతం తాడేపల్లిగూడెం బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా మేలురకం రూ.100, నాసిరకం రూ.80కు విక్రయిస్తున్నారు.

ఉత్పత్తి తగ్గడంతో.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అతి పెద్ద కూరగాయల మార్కెట్‌గా పేరు గాంచిన తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ఇక్కడి నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. మహారాష్ట్ర, మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి టమాట ఇక్కడ దిగుమతి అవుతోంది. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో తక్కువ మొత్తంలో దిగుమతి అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే వరకు మరో నెల రోజులు వరకు ఇదే ధర కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు.

● "రూ.500 తీసుకుని కూరగాయలు మార్కెట్‌కు వెళ్తే కనీసం మూడు, నాలుగు రకాల కూరగాయలు కొనలేకపోతున్నాం. ఇప్పటికే ఉల్లి ధర కొండెక్కి కూర్చుంది. వంట నూనె ధరలు పెరిగిపోయాయి. దీనికి తోడు టమాట ధర విపరీతంగా పెరిగిపోవడంతో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, రెండు రకాల కూరగాయలు కొని సరిపెట్టుకుంటున్నాం" అని తాడేపల్లిగూడెంకు చెందిన ప్రసన్న వాపోయారు.

వైద్య లోపాలకు తావివ్వొద్దు: కలెక్టర్



మాట్లాడుతున్న నాగరాణి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య లోపం కారణంగా మాతాశిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షను భీమవరంలో శనివారం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. ప్రైవేటు వైద్యశాలలు ఉంటే వాటిని వదిలి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లాలో మాతృమరణాలు గతేడాదితో పోలిస్తే ఎక్కువగా ఉన్నాయన్నారు. రక్తహీనత అన్ని వయసుల వారిలో కనిపిస్తుందన్నారు. ఇరు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మాతాశిశు మరణాలను అరికట్టాలన్నారు. డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో బి.భానూనాయక్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బి.సుజాతారాణి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త కీర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన.. ఆహ్లాద అభ్యసన

ఉమ్మడి జిల్లాకు 6 రీసోర్స్ సెంటర్లు

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ఏర్పాట్లు

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో వెనుకబడిన తరగతుల(బీసీ) సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సొంత భవనాలున్న చోట డిజిటల్ రీసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయనుంది. విద్యార్థులకు పాఠ్యాంశాలు తేలిగ్గా అర్థమయ్యేందుకు డిజిటల్ సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో రీసోర్స్ సెంటర్ల ఏర్పాటుకు అనువుగా ఉన్న వసతి గృహాల వివరాలను ఇప్పటికే ప్రభుత్వం సేకరించింది.

ఎక్కడంటే.. ఏలూరు జిల్లాలో 30, పశ్చిమలో 29 బీసీ వసతి గృహాలున్నాయి. వీటిలో సొంత భవనాలు పటిష్ఠంగా ఉన్న ఏలూరు, జంగారెడ్డిగూడెంతో పాటు నూజివీడు డివిజన్‌లో మూడుచోట్ల, పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండలో ఈ సెంటర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రం భీమవరం వసతి గృహానికి కూడా రీసోర్స్ సెంటర్‌ను ప్రతిపాదించిన సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన భవనంలో బీసీ వసతి గృహం కొనసాగుతున్నందున మంజూరు కాలేదు. దీంతో పశ్చిమలో అనువైన సొంత భవనాలు లేక కేవలం ఒక్క పెనుగొండలోనే రీసోర్స్ సెంటర్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



పెనుగొండ బీసీ వసతి గృహం

రూ. కోటి వెచ్చించి.. ప్రతిపాదించిన వసతి గృహాల్లో ఒక గదిని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతారు. డిజిటల్ ఇంటరాక్టివ్ తెర వంటి వసతుల కోసం రూ. కోటి వరకు వెచ్చించనున్నారు. వసతి గృహం అంటే తినడానికి లేక బస చేయడానికే గాక పాఠశాల నుంచి వచ్చాక వివిధ సబ్జెక్టుల్లో సామర్థ్యాలను పెంచుకునేలా తయారు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి ఈ రీసోర్స్ సెంటర్లు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

అవసరాన్ని బట్టి ఆయా సబ్జెక్టుల్లో ప్రైవేటు బోధకులను నియమించుకోవచ్చని సూచిస్తున్నారు. నవంబర్ 14 బాలల దినోత్సవం నాటికి రీసోర్స్ సెంటర్లు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై జిల్లా బీసీ వసతి గృహాల పర్యవేక్షణ అధికారి గణపతిరావును సంప్రదించగా ప్రీ మెట్రిక్‌లో సొంత భవనాలున్న చోట రీసోర్స్ సెంటర్లకు అనువైన వసతి గృహాలను ప్రతిపాదించామన్నారు.

'ఇ'లా ముందుకు!

☛ మళ్లీ తెరపైకి విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రాలు

☛ 14 ఏర్పాటు చేసినా ప్రారంభించని వైకాపా సర్కార్

☛ ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంతో ఊపందుకోనున్న ప్రక్రియ



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే

పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులేస్తున్నాయి. బ్యాటరీ ఆధారిత (ఎలక్ట్రిక్) వాహనాలను ప్రోత్సహిస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి... ప్రారంభించకుండా వదిలేశారు. ప్రభుత్వ ఉద్యోగులు బ్యాటరీ ఆధారిత ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేందుకు రాయితీ కల్పించినా, వారెవరూ ముందుకురాలేదు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో.. ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రైవేటు విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో కేంద్రం ఏర్పాటు ఖర్చులో 25 శాతం గరిష్ఠంగా రూ.3 లక్షల చొప్పున రాయితీ ఇవ్వనుంది. ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను నోడల్ ఏజెన్సీగా నూతన పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ(నెడ్‌క్యాప్) పర్యవేక్షించనుంది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల స్థలాల్లో ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ స్టేషన్లలో వినియోగించిన విద్యుత్తుపై నిర్వాహకుల నుంచి యూనిట్‌కు రూపాయి చొప్పున అద్దె వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 14.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 14 చోట్ల విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. గత ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో... అవి నామమాత్రంగా మిగిలాయి. ఏలూరు గ్రామీణ మండలం శనివారపుపేట, భీమవరంలో మాత్రమే ప్రస్తుతం పని చేస్తున్నాయి. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు రాయితీనిస్తామని తాజాగా ప్రభుత్వం ప్రకటించడంతో మిగతా స్టేషన్లు వినియోగంలోకి రానున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఛార్జింగ్ స్టేషన్లు ఐవోసీఎల్ ఆధ్వర్యంలోని పెట్రోలు బంకుల్లో టాటా పవర్ ఛార్జర్ ద్వారా పనిచేసేలా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీ.. ప్రభుత్వ ఉద్యోగులు బ్యాటరీ ఆధారిత ద్విచక్ర వాహనాలు కొనేందుకు నెడ్‌క్యాప్ ద్వారా రాయితీనిచ్చే విధానాన్ని 2022లో ప్రవేశపెట్టారు. అప్పట్లో ఈ-వాహనాలు కొత్తగా రావడం, కొన్నింటిలో సాంకేతిక లోపం కారణంగా అగ్నిప్రమాదాలకు గురికావడంతో.. వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం సమస్యలన్నింటినీ అధిగమించడంతో బ్యాటరీ ఆధారిత వాహనాల కొనుగోళ్లు పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండేళ్లలో కేవలం 10 మంది ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే నెడ్‌క్యాప్ ద్వారా రాయితీతో వాహనాలు కొనుగోలు చేశారు. 'తాజాగా ఎన్డీయే ప్రభుత్వం ఉద్యోగులు బ్యాటరీ ఆధారిత వాహనాలు కొనేందుకు అనువుగా కొత్త మార్గదర్శకాలు రూపొందించే అవకాశముంది. తుది విధివిధానాలు ఖరారయ్యాక, ఉద్యోగులు రాయితీ కింద బ్యాటరీ ఆధారిత ద్విచక్ర వాహనాలు కొనేందుకు ఆసక్తి చూపొచ్చు' అని నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి హరీశ్ తెలిపారు.

గురువుకు విలువిస్తేనే మెరుగైన సమాజం: మంత్రి



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రామానాయుడు, పక్కన మోటివేషనల్ స్పీకర్ ప్రదీప్

పాలకొల్లు పట్టణం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: గురువులకు విలువ పెరిగినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని మంత్రి, ధర్మారావు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు రామచంద్రా గార్డెన్స్‌లో అంతర్జాతీయ గురుపూజోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువు స్థానం పదిలమని, మద్యం దుకాణాల వద్ద, సినిమా థియేటర్ల వద్ద గురువులను కాపలాగా పెట్టి వైకాపా ప్రభుత్వం గురు స్థానాన్ని కించపరిచిందన్నారు. జగన్ పాలనలో డీఏల మాట అటుంచి జీతాలు కూడా సకాలంలో అందక సిబిల్ స్కోర్ పడిపోయి అప్పు కూడా తీసుకోలేని పరిస్థితికి చేరుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని 1వ తేదీనే జీతాలు అందిస్తుందన్నారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, సినీ నటుడు ప్రదీప్ ఉపన్యాసంతో ఉత్తేజ పరిచారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలో 125 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను దుశ్శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్ఎన్‌వి శర్మ, తెదేపా, భాజపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎం శివరామప్రసాద్, అధికారులు

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

కాళ్ల, న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్ పేర్కొన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తేమ శాతం, నమూనా సేకరణ, గోనె సంచుల సేకరణ తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

సంతకాలు లేకుండానే ఇళ్ల పట్టాలు జారీ | 14లో | ఇరవై ఏళ్లు నిండకుండానే చోరీల బాట


సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానంతో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేలా అన్నదాతలు అవగాహన పెంచుకునే విధంగా కృషి చేయాలని వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త కరుణశ్రీ అధ్యక్షతన వ్యవసాయంలో ఆధునిక స్వయంచాలక పరికరాలు, వ్యవసాయ పద్ధతుల వినియోగంపై అవగాహన, బృంద చర్చ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వినియోగాన్ని తగ్గించి ఎరువుల సామర్థ్యాన్ని పెంచే విధంగా మార్కెట్‌లో వైర్లెస్, వైర్డ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ప్రత్యేక యాప్ ద్వారా చరవాణికి అనుసంధానం చేసి వినియోగించడం ద్వారా సాగు ఖర్చు తగ్గి మంచి దిగుబడులు రాబట్టవచ్చని వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ బిందు సేద్యంలో ఆటోమేటెడ్ విధానాలు రైతులకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. మోబిటెల్ సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి యంత్ర పరికరాల పనితీరు వివరించారు. పరిశోధన సంచాలకురాలు మాధవి, శాస్త్రవేత్తలు గౌతమ్ దీక్షితులు, చెన్నకేశవరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, దేవీ ప్రసాద్ రెడ్డి, దీప్తి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోవిందరాజులు

సంతకాలు లేకుండానే ఇళ్ల పట్టాలు జారీ

బయట పడుతున్న వైకాపా అక్రమాలు



ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: అయిదేళ్లలో వైకాపా సాగించిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఆచంట మండలం కొడమంచిలి గ్రామంలో సంబంధిత అధీకృత అధికారి సంతకం లేకుండానే ఇళ్ల పట్టాలు జారీ చేసిన వ్యవహారం వెలుగు చూసింది. ఈ విషయమై ఎన్డీయే నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఈ బాగోతంపై రెవెన్యూ, ఇతర శాఖల యంత్రాంగం క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టింది. గ్రామ స్థాయి ఉద్యోగులు తమ వద్ద ఉన్న జాబితాకు అనుగుణంగా ఆయా పట్టాల పరిశీలన చేపట్టారు. ఇందులో సుమారు 40 పట్టాలకు మండల రెవెన్యూ అధికారి సంతకం లేనట్లుగా గుర్తించారు. ఈ పట్టాలు పొందిన వారిలో అధిక శాతం ఆయా స్థలాల్లో నిర్మాణాలు సైతం చేయడం గమనార్హం. గ్రామంలో సుమారు 319 మందికి వివిధ ప్రాంతాల్లో పట్టాలు ఇవ్వగా 60కి పైగా ఈ రకమైన బోగస్ పట్టాలు ఉన్నట్లు అంచనా. డిజిటలైజేషన్ చేసి పుస్తకం రూపంలో ఇచ్చిన కొన్నింటిలో పేర్లు మార్పు చేసి ఇచ్చినట్లుగా గుర్తించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలంలోనూ పట్టాలు ఇచ్చినట్లు నిర్ధారించారు. రెండు రోజుల్లో పూర్తి లెక్కలు తేలుతాయని ఉద్యోగులు చెబుతున్నారు. సొమ్ము చెల్లించినా తమకు ఎటువంటి స్థలం చూపలేదని అధికారుల పరిశీలనకు వెళ్లిన సందర్భంలో పలువురు బాధితులు వాపోయారు.

బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక అనుమతి కోసం ఈ నెల 26వ తేదీలోపు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్, పాన్ కార్డుల నకళ్లు అంజేసి చలానా, జీఎస్టీ చెల్లించి రసీదు పొందాలని పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లోకి కిసాన్ సమ్మాన్ నిధి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద కేంద్ర ప్రభుత్వం 18వ విడత నిధులను శనివారం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 86,610 మంది రైతులకు రూ. 17.32 కోట్ల మేర లబ్ధి చేకూరనుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో ఏటా మూడు విడతల్లో రూ.6 వేలను కేంద్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ ఏడాది రెండో విడత కింద రూ. 2 వేలు జమ చేసింది.

వేధింపులు అరికట్టాలంటూ ధర్నా


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న యానిమేటర్లు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: డ్వాక్రా యానిమేటర్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ యానిమేటర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎ. నిర్మల మాట్లాడుతూ రాష్ట్రంలో మెరుగైన పాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం యానిమేటర్లపై వేధింపులను అరికట్టడంతో విఫలమైందన్నారు. వేతన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. అనంతరం డీఆర్వో ఉదయ భాస్కరరావుకు వినతి పత్రం అందజేశారు.

జగన్మాత దుర్గమ్మకు ద్వారకా తిరుమల సారె


సారె తీసుకువస్తున్న ద్వారకా తిరుమల దేవస్థానం అధికారులు, అర్చక బృందం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, సారెను శనివారం సమర్పించారు. ఆలయ ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు సారె చూపించిన అనంతరం వారు దుర్గగుడి వైదిక కమిటీ సభ్యులకు అందజేశారు. సారె తీసుకు వచ్చిన దేవస్థానం పాలకమండలి ఛైర్మన్, ఈవో మూర్తిలకు ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. స్థానాచార్య శివప్రసాద శర్మ వారికి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మహిళలకు సుస్థిర ఉపాధి: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్తున్న మహిళల్లో ఎక్కువ మంది మోసపోతున్నారని.. దీనికి అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగరాణి మెప్మా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు స్థానికంగా సుస్థిర ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళల అక్రమ రవాణా, ఇతర సామాజిక సమస్యలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వీధి విక్రయదారులను సమావేశపరిచి శుభ్రమైన ఆహారాన్ని తయారు చేసి అందించేలా అవగాహన కల్పించాలన్నారు. మెప్మా ఏవో రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్లు నిండకుండానే చోరీల బాట

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తూ జల్సాలు


నిందితులు హిమాన్షు, అనిల్

నిజాంపేట, న్యూస్‌టుడే: పట్టుమని 20 ఏళ్లు నిండని కుర్రాళ్లు ముఠాగా ఏర్పడి ఖరీదైన బైకుల చోరీలకు పాల్పడుతున్నారు. దొంగిలించిన వాహనాలను అమ్మి.. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. వారి వ్యవహారాన్ని బాచుపల్లి పోలీసులు ఆటకట్టించారు. ముగ్గురి నుంచి 8 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఓ మైనర్ ఉండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన పామర్తి హిమాన్షు (19) నిజాంపేట భండారీ లేఅవుట్‌లో, మధ్యప్రదేశ్‌కు చెందిన బాగేలి అనిల్ (19) బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో ఉంటున్నారు. నిజాంపేటకే చెందిన మరో బాలుడు (16)తో స్నేహం కుదిరింది. వీరంతా విద్యార్థులైనా జల్సాలకు అలవాటు పడ్డారు. ఖరీదైన బైకులు ఎక్కడ పార్కింగ్ చేసి ఉన్నా.. నిమిషాల్లోనే మాయం చేస్తారు. ఇప్పటి వరకు నగరంలోని వేర్వేరు ఠాణాల పరిధిలో వాహనాలను ఎత్తుకెళ్లి సరదాలు తీర్చుకుంటున్నారు. తాజాగా కేపీహెచ్‌బీకాలనీ ఠాణాలో 6, బాచుపల్లి, రామచంద్రాపురం ఠాణాల్లో ఒక్కోటి చొప్పున 8 ఖరీదైన బైకులు దొంగిలించారు. వాటి విలువ రూ.12 లక్షలకు పైనే ఉంటుంది. శనివారం బాచుపల్లి చౌరస్తాలో తనిఖీలు చేస్తున్న సమయంలో పోలీసులకు చిక్కారు. సరైన పత్రాలు లేకపోవడంతో విచారించగా.. వారి బాగోతం వెలుగులోకి వచ్చింది. వాహనాలను స్వాధీనం చేసుకుని హిమాన్షు, అనిల్‌ను న్యాయస్థానంలో హాజరుపరచగా.. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. బాచుపల్లి డీఐ తిమ్మప్ప, సీఐ ఉపేందర్‌ల బృందాన్ని కూకట్‌పల్లి ఏసీపీ కె. శ్రీనివాసరావు అభినందించారు.

ఇసుక కొరతతో ఇబ్బందులు


భీమవరంలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. భీమవరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్మాణ రంగ కార్మికులు శనివారం ధర్నా చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బి. వాసుదేవరావు మాట్లాడుతూ ఇసుక కొరతతో భవన నిర్మాణ, అనుబంధ రంగాల కార్మికులు ఉపాధి లేక నష్టపోతున్నారన్నారు. సీపీఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక సమస్యను పరిష్కరించుకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్లో వ్యవసాయ కోర్సులు

ఉండి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ధ్రువపత్ర కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. చిరు ధాన్యాలు, సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకం కోర్సుల్లో 8 వారాల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయంతోపాటు కంప్యూటర్ లేదా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ఉండాలన్నారు. వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్ సైట్ (www.angrau.ac.in) ను సందర్శించవచ్చన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు దసరా సెలవులు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్‌ఐటీల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు శనివారం స్వగ్రామాలకు బయలుదేరారు.



గంజాయి రవాణా కట్టడికి తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా గస్తీ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మసీదులు, దేవాలయాలు, చర్చిల వద్ద ప్రత్యేకంగా నిఘా పెట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల్లో వాహనాలు ఆపి, చోదకులకు ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహించారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరంలో ఆచూకీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఒక బాలిక(14) అదృశ్యమై రాజమహేంద్రవరంలో దొరికిన సంఘటన యలమంచిలి మండలంలో చోటు చేసుకుంది. యలమంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన బాలిక శుక్రవారం రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించినా ప్రయోజనం లేకపోయింది. కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ ఆర్.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా బాలిక ఆచూకీ రాజమహేంద్రవరంలో లభ్యమైందని తెలిపారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు!

ఆగమేఘాలపై క్లబ్‌ల మూత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న క్లబ్‌లను శనివారం హడావుడిగా మూసివేశారు. తనిఖీలకు ప్రత్యేక పోలీసు దళాలు వచ్చాయనే సమాచారంతో అప్పటికే క్లబ్‌లలో ఉన్నవారిని నిర్వాహకులు బయటకు పంపించి తాత్కాలికంగా మూసివేసినట్లు గుసగుసలు వినిపించాయి. తనిఖీల విషయం బయటకు పొక్కడంతో నిర్వాహకులు అప్రమత్తమయ్యారని, దీంతో ప్రత్యేక దళాలు వెనుదిరిగినట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

భీమవరం

• భీమవరం • ఉండి

ముంపు నివారణకు చర్యలు


పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో ముంపుబారిన పడుతున్న ప్రాంతాల్లో సమస్యలను అధిగమించేలా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ఆదేశించారు. 18వ వార్డులో పలు ప్రాంతాలను ఆయన శనివారం పరిశీలించారు. లోతట్టు రహదారులను మెరక చేయించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి చెప్పారు. అక్రమ కట్టడాలు లేకుండా చూడాలన్నారు.

యోగాతో ప్రశాంతత


ధ్యాన సాధనలో కలెక్టర్ నాగరాణి

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ఒత్తిడిని అధిగమించేందుకు, మానసిక ప్రశాంతతకు యోగా చక్కటి సాధనమని కలెక్టర్ నాగరాణి అన్నారు. భీమవరం మండలం చినఅమిరంలో యోగా కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. అనంతరం అభ్యాసకులు, భక్తులతో కలిసి యోగా సాధన చేశారు. కేంద్రం నిర్వాహకుడు కె.కృష్ణంరాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే

సమస్య: చినఅమిరం పంచాయతీలో ప్రధాన రహదారి వెంబడి చెత్త వేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

- సత్యనారాయణ, స్థానికుడు

సమాధానం: వెంటనే చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

- కనకారావు, గ్రామ ప్రత్యేకాధికారి

విద్యుత్తు తీగలపై పొదుల తొలగింపు

స్పందనకు వందనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధి జువ్వలపాలెం రోడ్డులోని అడ్డవంతెన పక్కన ఉన్న అయ్యప్పవీధిలో విద్యుత్తు తీగలకు పొదులు అల్లుకుని ప్రమాదకరంగా మారిన తీరుపై 'ఈనాడు- మేమున్నాం.. మీకు తోడుగా'లో శనివారం ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ టి.పెద్దిరాజు స్పందించారు. ఆ ప్రాంతంలో పొదులు, పిచ్చిమొక్కల తొలగింపు పనులను చేయించి కిందకు జారిన విద్యుత్తు తీగలను సరిచేయించారు.

సర్కారు బడుల్లో.. సేంద్రియ వనాలు


ఉప్పరగూడెం పాఠశాల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరల సేద్యం

ఉండి, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సర్కారు బడులు సేంద్రియ వనాలతో కళకళలాడుతున్నాయి. ఈ ప్రాంగణాల్లో పండించిన ఆకు, కాయగూరలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తున్నారు.

మార్చారిలా.. ఉండి మండలం ఉప్పరగూడెం ప్రాథమిక పాఠశాల 38 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. భవనం పోను మిగిలిన భాగమంతా గతంలో పల్లంగా ఉండటంతో వర్షం కురిస్తే మురికి కూపంగా మారిపోయేది. ఏడాది కిందట ఈ పాఠశాలలో కేవలం ఆరుగురే విద్యార్థులుండేవారు. ఇలాంటి తరుణంలో ప్రధానోపాధ్యాయుడిగా ఇక్కడికి బదిలీపై వచ్చిన కలిదిండి రవి కుమార్ వర్మ స్థానికులతో చర్చించి పిల్లలను పాఠశాలకు పంపించాలని అభ్యర్థించారు. 'చదువొస్తేనే బడిలో ఉంచండి.. లేకపోతే ఇళ్లకు తీసుకెళ్లండి' అనే నినాదంతో స్థానికుల్లో చైతన్యం నింపడంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 28కి పెరిగింది. గత వేసవిలో ప్రాంగణంలో మట్టిపూడిక పనులు పూర్తిచేశారు. వర్షా కాలం ప్రారంభం కాగానే ఆ ప్రాంగణంలో వంగ, బెండ, బీర, ఆనబ, చిక్కుడు, దోస, అరటి, కంద, మునగ తదితర కూరగాయలు, తోటకూర, పాలకూర, చుక్కకూర, బచ్చలి, కొత్తిమీర వంటి ఆకుకూరల సాగు ప్రారంభించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మొక్కలన్నీ ఏపుగా పెరిగి కాపు ఇస్తున్నాయి. మట్టి పూడిక పనులకు రూ.42 వేలు వెచ్చించినట్లు ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌వర్మ వివరించారు. ఇటీవల ఈ వనాన్ని కలెక్టర్ నాగరాణి సందర్శించి ఉపాధ్యాయులను అభినందించారు.


వనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

సాగు పాఠాలు నేర్పుతూ..



భీమవరం పట్టణ పరిధి బలుసుమూడి ఎస్టీకాలనీలో ఉన్న పీవీఆర్ పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణ గతంలో చెత్త, ముళ్లపొదలతో నిండి ఉండేది. ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆల్ఫ్రెడ్‌కింగ్, ఉపాధ్యాయులు టి.హెప్సిబా, కె.రాజకుమార్ చిన్నారులకు పాఠాలు చెబుతూనే పాఠశాల ఆవరణ శుభ్రతపై దృష్టిసారించారు. ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతిలో తోటకూర, గోంగూర, బీర, బెండ తదితర కూరగాయల సాగుతో పాటు అరటి, జామ చెట్లు నాటారు. నిత్యం సాయంత్రం పిల్లల్ని వనంలోకి తీసుకెళ్లి సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

రుచికరమైన వంటకాలు



భీమవరం ఆరోవార్డు ఎస్టీవీఎల్ఎన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైకె దుర్గారావు, ఉపాధ్యాయిని పి.శశిరేఖకు మొక్కల పెంపకంపై ఆసక్తి ఉంది. దీంతో పాఠశాల ఆవరణలో అందుబాటులో ఉన్న స్థలంలో వివిధ రకాల కూరగాయల సాగు మొదలు పెట్టారు. ఇక్కడ పండిన వంకాయలు, బెండ, బీర, ఆకుకూరలను మధ్యాహ్న భోజన పథకం వంటకాలకు వినియోగిస్తున్నారు.


రామరాజుతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

పారిశ్రామిక ప్రగతికి కృషి

ఉండి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజును ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అభినందించారు. శనివారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయానికి వెళ్లిన రఘురామకృష్ణరాజు, పలువురు నాయకులు రామరాజును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రామరాజు వారికి తెలిపారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: మంతెన రామరాజు ప్రమాణ స్వీకారానికి ఆకివీడు నుంచి తెదేపా, జనసేన, భాజపా నాయకులు మంగళగిరిలో ఏపీఐఐసీ కార్యాలయానికి తరలివెళ్లారు. భూపతిరాజు తిమ్మరాజు, బొల్లా వెంకట్రావు, గంధం ఉమ, మోపిదేవి శ్రీను, జాకీర్, బి.సరళకుమారి, బొర్రా సుజాత తదితరులు రామరాజుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు


పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు, అతిథులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భీమవరం శ్రీరామపురం కూడలి సమీపాన ఉన్న గాంధీ కస్తూరిబా భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు చేకూరి ఝాన్సీ, కేవీ సుబ్బరాజు, కలిగొట్ల గోపాలశర్మ, ఏవీ నరసింహరాజులకు సర్వోదయ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ మార్గదర్శకులని పేర్కొన్నారు. సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, మానవత సంస్థ సభ్యులు, విశ్రాంత ఆలయాధికారి బీహెచ్ ఆనందస్వరూప వర్మ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం


ప్రదర్శనలో పాల్గొన్న ఎస్పీ నయీం అస్మీ, అధ్యాపకులు, విద్యార్థులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. ఇస్రో అంతరిక్ష వారోత్సవాలను సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో భీమవరంలోని విష్ణు పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం స్పేస్‌వాక్ పేరిట చైతన్య ప్రదర్శనను బీవీరాజు విద్యాసంస్థల ప్రాంగణం నుంచి కొవ్వాడ గ్రామ కూడలి వరకు నిర్వహించారు.

అర్చకులకు అండగా ప్రభుత్వం


బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో సీతారామలక్ష్మి తదితరులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో భీమవరంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్న ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు రూ.10 వేల సహాయాన్ని అందించడంపై బ్రాహ్మణులు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం వైకాపాకు చెందిన పాండ్రంకి పవన్‌శర్మకు కండువా కప్పి తెదేపాలోకి ఆహ్వానించారు. తెదేపా బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ చెరుకుపల్లి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

ఉండి, న్యూస్‌టుడే: నిబంధనల మేరకు ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు అన్నారు. ఉండి మండల పరిషత్తు కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరికీ మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది రైతులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఆకివీడు, వీరవాసరం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యాన్ని రవాణా చేయవచ్చని అధికారులు తెలిపారు. ఆకివీడు, వీరవాసరం, భీమవరంలలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో


ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం ఆర్డీవోగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఆయన కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం ఎంపీడీవోగా కందుల కిరణ్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారిగా ఏవీవీఎస్ఆర్ఎస్ కొండలరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవానికి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలం నుంచి పాలకోడేరుకు బదిలీపై వచ్చిన ఈవోపీఆర్డీ రామప్రసాద్, పాలకోడేరు కార్యదర్శిగా నియమితులైన బి.గోపి, విస్సాకోడేరు కార్యదర్శి కె.పవన్‌కుమార్, మోగల్లు కార్యదర్శి కె.సుజాతలు శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ఇసుక కొరత తీర్చాలంటూ నిరసన



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి కొరవడిందన్నారు. అనంతరం తహసీల్దారు జి.సుందర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఇసుక సరఫరాలో ఇబ్బందులను తొలగించాలని కోరుతూ కార్మికులు ఆకివీడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వినతి పత్రం అందజేశారు.

భయపెట్టిన కొండచిలువ



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధిలో యనమదుర్రు కాలువ గట్టున ఉన్న ఓ ఇంట్లో భారీ కొండ చిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానిక మహిళ శనివారం తెల్లవారుజామున గదులు తుడుస్తుండగా మంచం కింద కొండ చిలువ కనిపించింది. ఆమె బయటకు పరుగు తీసి చుట్టుపక్కల వారికి విషయం చెప్పగా కొందరు కర్రలు, వలలతో దాన్ని గదిలోంచి బయటకు తెచ్చి హతమార్చారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కాలువ ఎగువ నుంచి ఈ ప్రాంతానికి కొట్టుకువచ్చిన భారీ కొండ చిలువలు, ఇతర విష సర్పాల సంచారం పెరగడంతో స్థానికులు ఆందోళన చెందారు.

శుభకరీ.. అన్నపూర్ణేశ్వరీ


సోమేశ్వరాలయంలో అన్నపూర్ణమ్మ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లు శనివారం గాయత్రీదేవి, అన్నపూర్ణ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ సన్నిధిలో లక్ష కుంకుమార్చన చేశారు. రాత్రి ఆలయ కళా వేదికపై వేద గోష్ఠి నిర్వహించారు. నాచువారి కూడలిలో కొలువైన కనకదుర్గమ్మను అన్నపూర్ణాదేవి రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

ఉండి, కాళ్ల, ఆకివీడు, న్యూస్‌టుడే: ఉండి మండలం చిలుకూరులో కొలువైన పైడమ్మకు కుంకుమ పూజలు చేశారు. కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి ఆలయ మండపంలో ధనలక్ష్మి అలంకరణ ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.


ఆకివీడు: అలంకరణలో పెద్దింట్లమ్మ

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం గండిపోచమ్మ ఆలయంలో సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి గ్రామానికి చెందిన మద్దాల నాగబులితాతయ్య, వెంకట లక్ష్మి దంపతుల కుమార్తెలు రూ. 2.50 లక్షల విలువైన బంగారు కనుబొమ్మలు, రెప్పలు సమర్పించారు.


కాళ్లకూరు: ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారి ప్రతిమలు


వీరవాసరం: బంగారు కనుబొమ్మలు సమర్పించిన భక్తులు

నిర్మాణం తొలగించాలని ఉత్తర్వులు

గూట్లపాడు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం గూట్లపాడు పంచాయతీ చెరువు భూమిలో అనుమతి లేకుండా నిర్మించిన ఆలయాన్ని 15 రోజుల్లో తొలగించాలంటూ గతంలో పంచాయతీ కార్యదర్శి సంబంధిత కమిటీ ప్రతినిధులకు నోటీసులు ఇచ్చారు. కలెక్టరు ఆదేశించినా అవి అమలు కాలేదు. ఈ నేపథ్యంలో స్థానిక నివాసితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం గతంలో పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నోటీసును యథావిధిగా అమలు చేయాలంటూ తాజాగా శనివారం హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.

నేడు కాపు సమ్మేళనం

గునుపూడి, న్యూస్‌టుడే: కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా) ఆధ్వర్యంలో కాపు సమ్మేళనాన్ని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి హరనాథ్‌రావు, కార్యదర్శి ఆరేటి సత్యనారాయణ తెలిపారు. స్థానిక కోపా కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

పాలకోడేరు, న్యూస్‌టుడే: మైపగ్రామంలో వృద్ధుడిపై హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితుడు పరసా పాపారావును శనివారం అరెస్టు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎన్.హరిబాబు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 16న ఇంటి వద్ద నిద్రిస్తున్న శేషారావును నిందితుడు రాయితో కొట్టి పరారైనట్లు ఎస్సై తెలిపారు. అతడు ఇంటికి వచ్చాడనే సమాచారంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అతడిని భీమవరం కోర్టులో శనివారం హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక లారీలు స్వాధీనం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధిలో రసీదుల్లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.కాళీచరణ్ శనివారం చెప్పారు. యర్నగూడెం పరిధి పోతవరం నుంచి ఒకటి, వీరంపాలెం పరిధి పట్టెంపాలెం నుంచి వచ్చిన మరో లారీని పట్టుకున్నట్లు తెలిపారు. లారీ చోదకులతో పాటు యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

జూదరుల అరెస్టు

కాళ్ల (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: కాళ్ల మండలం పెదఅమిరం పరిధిలో జూదాలు ఆడుతున్న 10 మందిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.94,980 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు చెప్పారు. తనిఖీలు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగినట్లు పేర్కొన్నారు.

రహదారి ప్రమాదంపై కేసు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం రాజులపేట సర్పంచి నల్లపురాజు వెంకట రామరాజు శుక్రవారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై సర్పంచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

తెరచుకున్న రైల్వేగేటు

శృంగవృక్షం (పాలకోడేరు), న్యూస్‌టుడే: ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 3న మూసివేసిన శృంగవృక్షం రైల్వేగేటు శనివారం సాయంత్రం తెరచుకుంది. రాకపోకలను పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	రామ్‌నగర్ బన్నీ
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	దక్షిణ
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	స్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	స్వాగ్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కాళి

ఊరికి దూరం.. వసతులు ఘోరం!

పేదల కాలనీల్లో తప్పని అవస్థలు


వర్షం వస్తే ఇలా..

భీమవరం మండలం గొల్లవానితిప్పలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన లేఅవుట్‌లో అంతర్గత మార్గం ఇది. నివాస యోగ్యం కాని, పల్లపు ప్రాంతాల్లో భూములు సేకరించి పేదలకు స్థలాలు కేటాయించి చేతులు దులుపుకొన్న గత పాలకులు ఆయా ప్రాంతాల్లో కనీస వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. చిన్నపాటి వర్షం కురిసినా ఆయా కాలనీలో అంతర్గత మార్గాలు బురద కయ్యల్లా మారిపోతున్నాయి.

భీమవరం మండలంలో ఇలా..		
పేదల కాలనీలు: 19	పూర్తయినవి: 1,083	
మంజూరైన ఇళ్లు: 1,691	మధ్యలో నిలిచినవి: 608	
	ప్రారంభం కానివి: 298	

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ ప్రకటనలతో ఊదరగొట్టిన గత వైకాపా పాలకులు శివారు ప్రాంతాల్లో భూముల సేకరణకు రూ.కోట్లు వెచ్చించారు. వీటిలో చాలా వరకు పల్లపు ప్రాంతాలు కాగా పూర్తి స్థాయిలో పూడిక పనులు చేయకుండానే లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. తరువాత మౌలిక వసతుల ఊసే పట్టించుకోలేదు. దీంతో కొన్ని లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. నిర్మాణాలు జరిగిన లేఅవుట్లలోనూ కనీసం అంతర్గత మార్గాలు కూడా లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క కాలనీలోను రహదారులు, మురుగు పారుదల, తాగునీటి వ్యవస్థను నాటి పాలకులు ఏర్పాటు చేయలేకపోయారు. పేదల కాలనీల్లో వసతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. అంతర్గత మార్గాల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తామని గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి ఏఈ శశికుమార్ తెలిపారు.



భీమవరం మండలం నాగిడిపాలెం శివారులో ప్రభుత్వ లేఅవుట్‌లో మార్గం ఇలా బురదతో నిండి ఉంది. సౌకర్యాలు లేని చోట స్థలాలు కేటాయించారంటూ గతంలో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినా నాటి పాలకులు పట్టించుకోకుండా మొండిగా ముందుకెళ్లారు. ఇక్కడ నాలుగు అంతర్గ మార్గాలు ఉండగా ఒక్కటి కూడా సక్రమంగా లేదు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసుకోవాలి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ వై.రవికుమార్ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై స్థానిక మండల పరిషత్తు సమావేశం మందిరంలో శనివారం క్షేత్రస్థాయి ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో మండల రైతుల నుంచి 36,342 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన సంచులను ముందస్తుగానే సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యం అమ్ముకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఈ విషయాన్ని గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో బీవీఎస్‌వీ శర్మ, ఏవో జ్యోషిలా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఈఈగా మధుకుమార్



నరసాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు నరసాపురం ఈఈగా కొల్లాబత్తుల మధు కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు విజిలెన్సు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈఈగా విధులు నిర్వహించిన బళ్ల సురేశ్‌కుమార్ ఏలూరు విజిలెన్స్ స్క్వాడ్‌కు బదిలీపై వెళ్లారు.

ఈవోపీఆర్డీ బాధ్యతల స్వీకరణ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం ఈవోపీఆర్డీగా పి.మూర్తిబాబు బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు శనివారం పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: షావుకారుపేటలో మురుగు కాలువ పొంగి పొర్లుతోంది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారడమే కాకుండా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. **- కె.సుజన్‌పాల్, షావుకారుపేట**

సమాధానం: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. **- డి.డేవిడ్, పురపాలక పారిశుద్ధ్య అధికారి**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: పాలకొల్లు నుంచి భీమవరం వెళ్లే రహదారిలో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుపోయాయి. దీంతో విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతోంది. **- డేవిడ్, పాలకొల్లు**

సమాధానం: పరిశీలించి పాదులు తొలగిస్తాం. **-శ్రీనివాస్, గ్రామీణ విద్యుత్తు ఏఈ**

చెత్త తొలగింపు



పెనుగొండ, న్యూస్‌టుడే: నగరేశ్వర, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ సమీపంలో రహదారిపై చెత్త పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న వైనంపై ఈ నెల 3న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పెనుగొండ నగర పంచాయతీ కమిషనర్ నక్కా శ్యామల సోనీ, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకర రావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తొలగింపజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు బ్లీచింగ్ చల్లారు.

రహదారిపై వాహనాలు..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ వద్ద ప్రైవేటు బస్సులు, వ్యానులు, వాహనాలు నిలుపుతున్నారని 'ఈనాడు'లో 'రోడ్డుపై వాహనాలు.. అడ్డంకులు' శీర్షికతో ఈ నెల 1న కథనం ప్రచురితమైంది. దీనిపై పట్టణ సీఐ కె.రజనీకుమార్ శనివారం స్పందించి వాహనాలను అక్కడి నుంచి తీయించి సమస్యను పరిష్కరించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అంచుల్లోకి వెళ్తే అంతే సంగతులు

నాలుగు నెలలుగా నత్తనడకన పనులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులో నిర్మించిన ప్రధాన రహదారి అంచుల పూడిక పనులు నత్తనడకన చేస్తున్నారు. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామంలో పాత కాలువ ప్రాంతం, గాంధీ బొమ్మ కూడలి మీదుగా పెదపల్లవపాలెం వరకు ఉన్న రహదారి గతంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండేది. 216 జాతీయ రహదారి ఏర్పాటుతో దీన్ని ఆ సంస్థకు బదలాయించారు. ఇటీవల జాతీయ రహదారిని రెండు వరుసలుగా అభివృద్ధి చేయడంతో పాటు గ్రామాల పరిధిలో వెలుపల నుంచి బైపాస్ మార్గాలు నిర్మించారు. దీంతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల పరిధిలో పాత రహదారులను పునర్నిర్మించి ఆర్ అండ్ బీ శాఖకు బదలాయించాల్సి ఉంది. దీంట్లో భాగంగా మొగల్తూరు, కాళీపట్నం తూర్పు, మల్లాడివారి దిబ్బ, సీతారామపురంలలో జాతీయ రహదారికి అవసరంలేని దారులను రూ.10 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేపట్టారు. మూడు నెలల కిందటే పనులు పూర్తి చేశారు.



మొగల్తూరు: నం.1 పాఠశాల ప్రాంతంలో అంచులు పూడ్చాల్సిన ప్రాంతం

నిలిచిన ఆర్టీసీ సేవలు..

రహదారి అంచులు పూడ్చక పోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నాలుగు నెలలుగా గ్రామంలోకి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. లేదంటే జాతీయ రహదారి పైకి వెళ్లి అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులపై ప్రయాణిస్తున్నారు.

రెండడుగులకు పైగా..

మొగల్తూరులో నిర్మించిన రహదారిని పలు చోట్ల గతంలో కంటే రెండు అడుగులు.. ఆపై ఎత్తు నిర్మించారు. దీంతో రహదారి పక్కన అంచుల్లో భారీ స్థాయిలో పూడిక చేయాల్సి ఉంది. పలు చోట్ల నామమాత్రంగానే పూడిక చేస్తున్నారు. ఆ పనులు కూడా నాలుగు నెలలుగా కొనసాగుతున్నాయి. అంచుల పూడిక లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలువురికి కాళ్లు విరిగిన సంఘటనలు ఉన్నాయి.

పరిశీలించి పరిష్కారానికి చర్యలు

రహదారి అంచుల నిర్మాణం చేస్తున్నాం. ఏమైనా సమస్యలు ఉంటే పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతాను.

-ఖాజా, ఏఈ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ, భీమవరం శాఖ



తహసీల్దార్ అనితా కుమారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల బోర్డు పునరుద్ధరించాలి

పెనుగొండ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల బోర్డును పునరుద్ధరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం భవన నిర్మాణ కార్మికులు, సీపీఎం నాయకులు ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ జి.అనితా కుమారికి వినతిపత్రం అందించారు. సీపీఎం మండల కార్యదర్శి సూర్నీడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ పాలనలో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి 1214 జీవోను రద్దు చేయాలన్నారు. మూడు నెలల నుంచి ఇసుక కొరతతో పనులు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉచిత ఇసుక హామీని కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కోరిన రైసు మిల్లుకే ధాన్యం : ఆర్డీవో

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు తాను పండించిన పంటను తాను కోరిన రైసు మిల్లుకే ధాన్యాన్ని విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఆర్డీవో దాసి రాజు అన్నారు.



మాట్లాడుతున్న దాసి రాజు

మండల పరిషత్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. రైతు తన పంటను కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో ఏడీఏ ఐ.అనిల్ కుమారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం, వీఏఏ, వీహెచ్‌ఏలు రైతులకు ఈ-పంట నమోదు చేసిన రైతు ఈకేవైసీ పూర్తిచేసి ధాన్యం విక్రయించుకునేలా చూడాలన్నారు. తహసీల్దార్ రాజ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ

పోడూరు, న్యూస్‌టుడే: పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు సూచించారు. పోడూరు ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఉద్యోగులు, సిబ్బందికి శనివారం శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ అవసరమైన సంచులు ముందస్తుగా సమకూర్చుకోవాలని, హమాలీలు, రవాణా వాహనాల ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో సదస్సులు పెట్టి కొనుగోలు ప్రక్రియలో మారిన అంశాలను రైతులకు వివరించాలని సూచించారు. గతంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించేలా సమన్వయంతో ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ముందే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా ప్రయత్నం చేసి విజయం సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.సుధాకర్ అన్నారు. స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. యువత సక్రమ మార్గంలో నడవకపోతే దేశాభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాబోయే కాలంలో అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషిస్తుందని, విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. 2047 వికసిత భారత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కరుమూరి వెంకట నరసింహారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, అకడమిక్ అడ్వైజర్ ఏబీఎన్ మూర్తి, నందుల సీతారామారావు, జి.రామలింగారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న సుధాకర్

వైభవ వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ

నరసాపురం, న్యూస్‌టుడే: వేములదీవి పడమరలోని వైభవ వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష అలంకరణ చేశారు. తిరుపతి బ్రహ్మోత్సవాలు సందర్భంగా అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

మొగల్తూరు, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా సామగ్రి విక్రయ దుకాణాలకు లైసెన్సులు తప్పనిసరి అని ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఈ నెల 30న నిర్వహించనున్న దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసుకునే దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేస్తామన్నారు. లైసెన్సు కోసం జీఎస్టీ చెల్లించిన రసీదు, ఆధార్, పాన్‌కార్డు, చలానా అసలు ప్రతులతో ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి

యలమంచిలి, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. మండలంలోని నార్నిమెరకలో ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గుంటూరులో శుక్రవారం నిర్వహించి గోపీమూర్తికి మద్దతు పలికి పీడీఎఫ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ సభ్యుల వారసత్వాన్ని కొనసాగిస్తానని, నీతి నిజాయతీగా పని చేస్తానని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.విజయరామరాజు, జిల్లా కార్యదర్శి ఎ.కె.వి.రాంభద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపీమూర్తి

విజయానికి కృషి చేయాలి.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎంపికైన బొర్రా గోపీమూర్తి విజయానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజశేఖర్ అన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక సమతా మహిళా భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్సీ దివంగత నేత షేక్ సాబ్జీ, సీనియర్ నాయకులు వలవల శ్రీరామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛతా హీ సేవా..?

కాలువలో ఎత్తలేనంత చెత్త

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలోని దాసరి నారాయణరావు వంతెన వద్ద నరసాపురం ప్రధాన కాలువ దుస్థితి ఇది. పురపాలిక పరిధిలో ఉన్న ప్రాంతంలో ఎత్తలేనంత చెత్తను సమీప దుకాణాల నుంచి తీసుకొచ్చి ఇలా కాలువలో వేస్తున్నారంటే ముక్కున వేలేసుకోవాల్సిందే. వందలాది గ్రామాలకు తాగునీటి వనరుగా ఉన్న ప్రధాన కాలువే ఇలా ఉంటే ఇతర కాలువల పరిస్థితిని ఊహించవచ్చు. ప్రస్తుతం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించిన తరుణంలో అత్యవసరంగా దీనిపై చర్యలు చేపట్టాల్సి ఉంది.



ముక్కు మూయాల్సిందే!

వడలి(పెనుగొండ), న్యూస్‌టుడే: వడలి-పిట్టల వేమవరం ఆర్ అండ్ బీ రహదారిలో వడలి శివారు ఇటుకల బట్టీ సమీపంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, బాటసారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వడలి నుంచి ఈ మార్గం పిట్టల వేమవరం వద్ద జాతీయ రహదారితో కలుస్తుంది. ఈ రహదారిలో వడలి, వెంకట్రామపురం, మునమర్రు తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు చర్యలు చేపట్టి చెత్తను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. వడలిలో పలు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈవోపీఆర్డీ సీహెచ్‌ఎస్వీ రెడ్డిని వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.



జర జాగ్రత్త.. అటు ప్రయాణం!

నిత్యం ఎంతో మంది రాకపోకలు సాగించే మార్గమిది.. కానీ కనీస నిర్వహణ లేక గోతులతో అధ్వానంగా మారింది. నెలమూరు-కొణితవాడ-కొమ్ముచిక్కాల వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.. స్థానిక అట్టల పరిశ్రమ వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నెలమూరు వాసులంతా ఇటు నౌడూరు, భీమవరం వెళ్లేందుకు ఈ మార్గంలో ప్రయాణిస్తారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ పరిశీలించి రహదారి అభివృద్ధికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**



పోక్సో కేసు నమోదు

నరసాపురం, న్యూస్‌టుడే: పదేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై శనివారం పోక్సో కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం మేరకు.. పట్టణంలోని ఒక ప్రాంతానికి చెందిన బాలికతో మేడపాడుకు చెందిన యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మార్టేరు, న్యూస్‌టుడే: నిడదవోలు-నరసాపురం ప్రధాన రహదారి నెగ్గిపూడిలో శనివారం అదుపు తప్పిన లోడు లారీ కల్వర్టుపైకి దూసుకొచ్చి అంచులో దిగబడింది. నరసాపురం ప్రధాన కాలువకు అనుసంధానంగా స్థానిక పొలాలకు నీరందించే చిన కాలువ కల్వర్టుకు రక్షణ గోడ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తెల్లవారుజామున పెనుగొండ వైపు నుంచి వస్తున్న లారీ ఒక్కసారి కల్వర్టు అంచులోకి దూసుకు రావడంతో కొంత భాగం నిర్మాణం కూలిపోయింది. లారీ కాలువ వైపు ఒరిగి పోగా ఎవరికి ఎటువంటి హాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న జలవనరుల, ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. నిర్మాణం పాడైన దృష్ట్యా దానికి మరమ్మతులు చేయించాలని లారీ యాజమానిని ఆదేశించారు. నీటి ప్రవాహానికి అడ్డులేకుండా కాలువలో పడిన నిర్మాణ శిథిలాలను తొలగించారు.



కల్వర్టుపై దిగబడిన లోడు లారీ

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: మండలంలోని గోదావరి తీర ప్రాంతం నుంచి ఇసుకను తవ్వినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు హెచ్చరించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అయోధ్య లంక, కరుగోరుమిల్లి, కోడేరు ప్రాంతాల నుంచి ఇసుక తరలించకుండా అక్కడ వీఆర్వో, వీఆర్‌ఏలతో నిఘా పెట్టినట్లు చెప్పారు. మండలంలో ఖాళీగా ఆరు రేషన్ దుకాణాలతో పాటు మరో రెండు కొత్త వాటికి త్వరలో నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఈ నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులు తమకు నచ్చిన మిల్లులకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని చెప్పారు.

వాహనాలు స్వాధీనం.. మొగల్తూరు, న్యూస్‌టుడే: కేపీపాలెం సౌత్‌లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులకు చెందిన వాహనాలు శనివారం స్వాధీనం చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం మేరకు గ్రామంలో ఇసుకను తరలిస్తున్నారని తమకు గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి మూడు లారీలు, ఒక పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

జగజ్జననీ పాహిమాం..

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. పలు కూడళ్ల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాలకు కమిటీల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం పూజలు జరిపించి నైవేద్యాలు సమర్పించారు. ● పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. ● వాసవీ ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ● యడ్ల బజారు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరించారు.



వాసవీశాంతిధాంలో అన్నపూర్ణాదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో పెనుమంట్రలోని కనకదుర్గమ్మ



లలితాదేవిగా మహిషాసుర మర్దని



నరసాపురం: స్టీమర్ రోడ్డులో..

పెనుగొండ, న్యూస్‌టుడే: నగరేశ్వర, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు, మంత్ర పునశ్చరణలు, మహా లింగార్చన, కుంకుమ పూజలు చేశారు. లలితాదేవి అలంకరణలో అమ్మవార్లు దర్శనమిచ్చారు.

పెనుమంట్ర, పోడూరు, ఆచంట, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పోడూరు మండలం కొమ్ముచిక్కాలలోని అమ్మవారిని మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆచంటలోని ఆచంటేశ్వర స్వామి, పెదమల్లంలో మాచేనమ్మ పల్లాలమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పెనుగొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు యువజన సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. శనివారం కళాశాలలో జిల్లా యువజన సర్వీసులు శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం భవిష్యత్తు మార్గదర్శకత్వంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్టులో ప్రతిభ చాటాలన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యువజన సర్వీసుల శాఖాధికారి కె.ప్రభాకర్ మాట్లాడుతూ యువత సేవల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ మేనేజర్ ఎస్.పట్టాభిరామన్న, యోగా కోచ్ కె.రామకృష్ణ, జి.ప్రవీణ్ కృష్ణ, కె.పల్లవి, కళాశాల ఎన్.ఎస్.ఎస్. అధికారి డాక్టర్ చిరంజీవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి ఖరీఫ్ పంటపై శిక్షణ

యలమంచిలి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం రెవెన్యూ డివిజన్ అధికారి దాసి రాజు హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నరసాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు అనిల్‌కుమార్, తహసీల్దార్ జి.పవన్‌కుమార్, సీఎస్‌డీటీ ఐ.వి.సత్యనారాయణ, కోఆపరేటివ్ అధికారులు, రైస్‌మిల్లర్లు, అగ్రికల్చర్ వీఏఏలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలచే ప్రారంభోత్సవాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఆధునిక వైద్య సేవలు ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం బ్రాడీపేట బైపాస్ రోడ్డు నందు సౌమ్య హాస్పిటల్ నూతన భవనాన్ని, పెనుమాదం రోడ్డులో సన్‌రైజ్ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులకు, యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో డా.జి.ఎల్.రాజశేఖర్, కర్రి వెంకట నారాయణరెడ్డి, కడగల వెంకట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కరెంటు కష్టాలు

పంచ గ్రామాలకు చుక్కలు చూపించిన విద్యుత్తు



మార్టేరు, న్యూస్‌టుడే: అంతంత మాత్రం సేవలతో నెట్టుకొస్తున్న విద్యుత్తు శాఖ శుక్రవారం రాత్రి మార్టేరు పంచ గ్రామాల ప్రజలకు చుక్కలు చూపించింది. తరచూ విద్యుత్తు లైన్లు ట్రిప్పవటంతో గంటల తరబడి సరఫరా ఆగిపోయింది. విసిగిపోయిన కొందరు అర్ధ రాత్రి మార్టేరు ఉప కేంద్రానికి చేరుకుని సిబ్బందిని నిలదీశారు. రాత్రి రెండు గంటల సమయానికి గాని సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరణ కాలేదు. మార్టేరు ఉప కేంద్రంలో పీటీఆర్ పాడవటంతో నెల రోజుల పైనుంచి ఆలమూరు ఉప కేంద్రం పీటీఆర్ నుంచి కొన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో తీవ్రమైన ఉక్కపోతతో మూడు నాలుగు రోజుల నుంచి విద్యుత్తు వినియోగం పెరిగింది. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచి లోవోల్టేజీ సమస్య తీవ్రమైంది. చివరకు ఆలమూరు పీటీఆర్‌పై అధిక లోడు పడటంతో తరచూ ట్రిప్పవుతోంది. దీంతో దీని పరిధిలో గ్రామాలకు సరఫరా ఆగిపోయింది. చివరకు ఆక్వా చెరువులు, ఇతర పరిశ్రమలకు వెళ్లే సరఫరాను నిలుపుదల చేసి ఈ సమస్యను సరిదిద్దారు. మార్టేరులో ఇటీవల జరిగిన ఇదీ మంచి ప్రభుత్వం కార్యక్రమంలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్రి అచ్యుతరామిరెడ్డి విద్యుత్తు తీరుపై ధ్వజమెత్తారు. మార్టేరు, పరిసర గ్రామాల్లో కరెంటు ఎప్పుడు ఉంటుంది, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందని, పాడైన పీటీఆర్‌ను మార్పు చేయకుండా వినియోగదారులను ఇబ్బందులు పెడుతున్నారంటూ మండిపడ్డారు. ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పిన అధికారులు రోజులు గడిచినా సరిదిద్దకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది.



తపాలా ఉద్యోగుల నిరసన

మార్టేరు, న్యూస్‌టుడే: తమపై పని ఒత్తిడి తగ్గించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దీనిలో భాగంగా ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల పరిధిలో తపాలా ఉద్యోగుల నల్ల రిబ్బను ధరించి తమ విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని వారు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో భాగంగా ఆయా పోస్టాఫీసుల వద్ద ఉద్యోగులు నినాదాలు చేశారు.

యూ ట్యూబ్ ఛానల్ నిర్వాహకులపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: అసత్య ఆరోపణలు చేస్తూ నగదు డిమాండు చేస్తున్నారనే ఆరోపణలతో భార్యా భర్తలపై శనివారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం మేరకు.. పట్టణానికి చెందిన చల్లా పద్మావతి, ఆమె భర్త అమ్మన్నరాజు తమకు డబ్బు ఇవ్వాలని, లేకపోతే తాము నిర్వహిస్తున్న యూ ట్యూబ్ ఛానల్‌లో జైన్ జ్యూయలర్స్ దుకాణంపై వ్యతిరేక ప్రచారం చేస్తామని గత కొంతకాలంగా బెదిరిస్తున్నారన్నారు. దీంతో తాము గత నెల 7న వారికి రూ.2 లక్షలు ముట్ట జెప్పామని బాధితులు వివరించారు. ఇంకా రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండు చేస్తున్నారని రాజేంద్రకుమార్ జైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

ఉపాధ్యాయులే జీవన మార్గదర్శకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : జాతి జీవన మార్గదర్శకులు, సమాజ దేవాలయానికి సిసలైన పురోహితులు ఉపాధ్యాయులేనని సాహితీ సామ్రాజ్యం వ్యవస్థాపక అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో భాస్కరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. 'విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రభావం' అంశంపై పలువురు వక్తలు మాట్లాడారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాపిరెడ్డి, సభ్యులు శేషాచార్యులు, జాన్‌విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి స్వాగతం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉంగుటూరుకు చెందిన బండారు గిరీశ్‌కుమార్ వైమానిక దళంలో సార్జెంట్ హోదాలో ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. శనివారం స్వగ్రామానికి వచ్చిన ఆయన్ను సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం శేషమహల్ రోడ్డు నుంచి మహతి పాఠశాలకు వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద ఇనుప చువ్వలు పైకిలేచి ప్రమాదకరంగా మారాయి. **- శ్రీధర్, స్థానికుడు**

సమాధానం: కల్వర్టు మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపడతాం. **- ఏసుబాబు, పురపాలక కమిషనర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు మండలం దర్శిపర్రులోని శివాలయానికి వెళ్లే మార్గంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంటోంది. అవి గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. **- రమేశ్, స్థానికుడు**

సమాధానం : కుక్కలు పట్టించి మరో ప్రదేశానికి తరలించడానికి చర్యలు తీసుకుంటాం. **- కోలా శేషవేణి, సర్పంచి**

సమస్య : పెంటపాడు మండలం వల్లూరుపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో మురుగు బోదె పూడిపోవడంతో మురుగంతా రహదారిపై నిలుస్తోంది. రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- ప్రసాద్, స్థానికుడు**

సమాధానం : మురుగు కాలువ బాగు చేయడానికి చర్యలు తీసుకుంటాం. **- రామారావు, పంచాయతీ కార్యదర్శి**



పట్టింపులేని పారిశుద్ధ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఇంటింటా చెత్త సేకరణ పనులు పూర్తి స్థాయిలో నిర్వహించకపోవడంతో రహదారులపై చెత్త మేట వేస్తోంది. హౌసింగ్‌బోర్డు కాలనీలోని మున్సిపల్ పార్కులో స్థానికులు చెత్త వేస్తున్నారు. ఆఖ్లో దాన్ని పంచాల్సిన ఉద్యానం డంపింగ్ యార్డుగా మారుతోంది. ప్రధాన గేటు వద్ద డంపర్ బిన్ను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. స్థానికులు చెత్త తీసుకొచ్చి నేరుగా రోడ్డుపై వేస్తున్నారు. దీనికి తోడు పారిశుద్ధ్య సిబ్బంది రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారవుతోంది. దీనిపై కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తామన్నారు.

మలుపులతో జర భద్రం

హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు

☛ గత నెల 12న చిలకంపాడుకు చెందిన నారాయణ పని నిమిత్తం తాడేపల్లిగూడెంకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా పెంటపాడు శివారు పెట్రోల్ బంకు సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని ఢీ కొనడంతో గాయపడ్డారు. చికిత్స పొందుతూ గత నెల 22న మృతి చెందారు. అదే మలుపు వద్ద గత నెల 15న రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరు గాయపడ్డారు.

☛ పెంటపాడు మండలం దర్శిపర్రు నుంచి వల్లూరుపల్లి వెళ్లే మార్గంలోని బొమ్మలతూము సమీపంలోని మలుపు వద్ద ఈ నెల 2న రాచర్లకు చెందిన రవి ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న పంటబోదెలోకి ద్విచక్రవాహనంతో పాటు పడిపోవడంతో గాయపడ్డారు.

☛ ఉమామహేశ్వరానికి చెందిన ఓ వ్యక్తి గణపవరం వెళ్తుండగా యానాలపల్లి మలుపు వద్ద వాహనం ఢీ కొనడంతో మృతి చెందారు.

పెంటపాడు, న్యూస్‌టుడే

పెంటపాడు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో మలుపులు ప్రమాదాలకు కేంద్రంగా మారాయి. ఆయా మలుపుల వద్ద మొక్కలు, కంపచెట్లు వంటి వాటిని తొలగించే పనులు చేపట్టకపోవడంతో గుబురుగా పెరిగి వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నాయి.

గ్రామాల్లో అధికం..

ముఖ్యంగా పెంటపాడు నుంచి దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, పెంటపాడు నుంచి ముదునూరు, పెంటపాడు నుంచి కస్పాపెంటపాడు పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ల, కస్పాపెంటపాడు నుంచి జట్లపాలెం, ఉమామహేశ్వరం, జట్లపాలెం నుంచి మౌంజీపాడు, మీనవల్లూరు నుంచి బి.కొండేపాడు, రావిపాడు చింతపల్లి నుంచి కోరుమిల్లికి వెళ్లే మార్గాల్లో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు వచ్చేంత వరకు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



పెంటపాడు శివారులో..

ప్రమాదకరంగా ప్రయాణం

మలుపులు సూచించే హెచ్చరిక బోర్డులు, స్టార్ గుర్తులు, వేగ నియంత్రికలు లేకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఈ మలుపుల్లో చోటు చేసుకుంటున్న ప్రమాదాలతో ఎంతో మంది మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.



దర్శిపర్రు - వల్లూరుపల్లి మార్గం

"పనికిరాని మొక్కలు, ముళ్లపొదలు తొలగించే పనులు చేపట్టాం. ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు మంజూరైన వెంటనే నియంత్రికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం." అని ఏఈ రవిబాబు తెలిపారు.

రైతు సంక్షేమంపై దృష్టి : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని... ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ధాన్యం కొనుగోలు సిబ్బందితో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటోందన్నారు.

'ఇసుక విధానం విఫలం'

తణుకు గ్రామీణం, తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక విధానం పూర్తిగా విఫలమైందని, అక్రమ రవాణా ద్వారా అధిక ధరకు విక్రయిస్తున్నారని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు విమర్శించారు. శనివారం వేల్పూరు భవన కార్మికులు యూనియన్ కార్యాలయం వద్ద మల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో అనేక లోపాలు ఉన్నాయని విమర్శించారు. ఇసుక, లారీ యజమానులు సిండికేట్ అయ్యారని ఆరోపించారు. సగటున 20 టన్నుల ఇసుక రూ.25వేలకు అమ్ముకుని ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మళ్లీ భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు అనుకుమార్, ఆదినారాయణ, ప్రభాకర్, నాగేశ్వరరావు, కృష్ణకిషోర్, రమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు. ● తణుకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు నినాదాలు చేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవానికి వినతి పత్రం అందజేశారు. ● ఇరగవరం మండలం రేలంగి భవన కార్మికుల యూనియన్ భవనం వద్ద శ్రీనివాసు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. భవన కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. ● ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. జిల్లా భవన కార్మిక సంఘం (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో జగ్గన్నపేట పంచాయతీ కార్యాలయం వద్ద సంఘ అధ్యక్షుడు కంకిపాటి రాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడారు. ఉపాధ్యక్షుడు రాంబాబు, గౌరవాధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరు: కార్మికుల ప్రదర్శన



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

శివారు.. సమస్యలతో బేజారు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : దువ్వ గ్రామ శివారులోని ఇందిరమ్మ కాలనీ వాసులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. గత వైకాపా పాలనలో వీటిని కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. మౌలిక వసతులు కల్పించ లేదు. మంచి నీరు అందక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి పైపు లైన్లకు కుళాయిలు ఏర్పాటు చేయలేదు. దీనిపై గ్రామ కార్యదర్శి భాస్కర్ స్పందిస్తూ..' 'కోనాల పంపింగ్ స్కీం నుంచి రెండు రోజులు, స్థానిక ట్యాంక్ నుంచి రెండు రోజులు చొప్పున నీరు అందిస్తున్నాం. పైపు లైన్లకు కుళాయిలు ఏర్పాటు చేస్తాం'' అని అన్నారు.

ఇదీ పరిస్థితి..

కాలనీ ఏర్పడి సుమారు 18 ఏళ్లు అవుతోంది. సుమారు 300 మంది వరకు జనాభా ఉన్నారు. మురుగు కాలువలు లేకపోవడంతో కాలనీలో ఎక్కడ మురుగు అక్కడే నిలుస్తోంది. కాలనీలో ఎక్కడ చెత్త అక్కడే మేట వేస్తోంది. మంచినీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా..పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



కోతకు గురవుతున్న గట్టు చూపుతున్న స్థానికులు



దెబ్బతిన్న పైపులైన్ నుంచి నీటి వృథా



"పైపులైన్‌ల నుంచి స్వచ్ఛమైన నీరు అందక అవస్థలు పడుతున్నాం. కనీసం వీటి నిర్వహణ కూడా పట్టించుకోవడం లేదు. దీనిలో ఉప్పు నీరు, చెరువు నీరు కలుస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కనీసం కాలనీ వైపు చూడటం లేదు." అని సుబ్బలక్ష్మి వాపోయారు.



"రహదారి కుంగిపోతుందని కాలనీలోని మహిళలు గతంలో పలు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు." అని సూర్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు.



సర్వమంగళ అమ్మవారు



వాసవీమాత



ఆరుగొలనులో..



మండపాక యల్లారమ్మ



బలుసులమ్మ

జయహో.. జగజ్జనని

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : తాడేపల్లిగూడెం మండలం ముత్యాలాంబపురంలో ముత్యాలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు శనివారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ వారిని విశేషంగా అలంకరించి అర్చనలు, ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో హరేరామప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల ఏడున సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రస్తుత అధ్యక్షుడు భవానీరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లోని అమ్మవార్లు శనివారం గాయత్రీదేవి, కాశీ అన్నపూర్ణ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, అర్చనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా పెద్ద సంఖ్యలో కుంకుమ పూజలు చేపట్టారు.



కాశీ అన్నపూర్ణగా విశ్వదుర్గేశ్వరి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వీరంపాలెంలో అమ్మవారు చంద్రఘంటాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలాత్రిపురసుందరి పీఠ నిర్వాహకులు గరిమెళ్ల వెంకటరమణశాస్త్రి అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం చండీయాగ హోమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కృష్ణబాబు దంపతులు, ఆర్డీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దువ్వలో కనకదుర్గ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : మండపాక యల్లారమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ● దువ్వలో కనకదుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ● దువ్వ దానేశ్వరికి అర్చకులు కుంకుమార్చనలు నిర్వహించారు.

యోగా గురువుకు సత్కారం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యవతీనగర్‌లో లయన్స్ క్లబ్, కైండ్‌నెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం శనివారం నిర్వహించారు. యోగా గురువు రామకృష్ణను సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు గట్టిం ప్రవీణ్ కృష్ణ, పిల్ల వెంకన్న పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

నీటి నిల్వలు లేకుండా చూడాలి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దోమల పుట్టుక నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మూడో వార్డులో శనివారం కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. వారంలో ఒక రోజు ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకుడు తాతాజీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నాణ్యమైన దిగుబడులు

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూమి సారవంతంగా మారి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కరుణశ్రీ తెలిపారు. స్థానిక కేవీకేలో సహజ వ్యవసాయంలో మేలైన పద్ధతులపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నవధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలు, కషాయాల తయారీ, వాడకంపై కేవీకే శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. రైతులకు ఉచితంగా కుక్కర్లు, డ్రమ్ములు ఉచితంగా పంపిణీ చేశారు. ఉద్యాన యాత్రలో భాగంగా నల్లజర్లలోని ఏకేఆర్‌జీ డిగ్రీ కళాశాల విద్యార్థులు వర్సిటీ, కేవీకేలను సందర్శించారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా పీఎం కిసాన్ 18 విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని రైతులు వీక్షించేలా కేవీకేలో తెర ఏర్పాటు చేశారు.



కుక్కర్లు, డ్రమ్ములు అందుకున్న రైతులతో కరుణ శ్రీ తదితరులు

తుప్పు వదిలించండి..



పట్టణ పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో..



ఉప ఖజానా కార్యాలయం వద్ద వాహనాలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే : తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో వాహనాలు తుప్పు పడుతున్నాయి. వీటిని ఖాళీ ప్రాంగణంలో ఉంచుతున్నారు. రోజుల తరబడి నిర్లక్ష్యంగా వదిలేయడంతో తుప్పు పడుతున్నాయి. వీటిలో కొన్ని కాలంచెల్లి నిరుపయోగంగా మారుతున్నాయి.